క్లుప్తంగా

రామ నామం గొప్పది



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న రామకోటి స్వామి

సారవకోట: రామ నామం గొప్పదని, ప్రతి నిత్యం దీనిని పఠించాలని రామకోటి స్వామి అన్నారు. మండలంలోని కిన్నెరవాడ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు కొరసాక సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో శనివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రామకోటి స్వామి మాట్లాడుతూ.. రామ నామం నిత్యం పఠించడం వలన పాపాలు తొలగిపోతాయన్నారు. ప్రజల్లో భక్తి భావం పెరిగితే సామాజికాభివృద్ధి జరుగుతుందన్నారు. బోయిన వెంకటరమణ, కొబగాపు గణపతిరావు, బైరి అచ్చెన్న, పెట్ల సోమేశ్వరరావు, తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

జీవామృతం తయారీపై అవగాహన



ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తూరు: ద్రవ జీవామృతాన్ని పంటలకు వినియోగించడం వలన అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సవర సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మహసింగిగూడలో గిరిజన రైతులతో క్వాలిటీ ద్రవ జీవామృతం తయారీ విధానం, కావాల్సిన పదార్థాలపై అవగాహన కల్పించారు. 250 లీటర్ల ద్రవజీవామృతాన్ని రైతులుతో తయారు చేయించారు. ద్రవ జీవామృతం వినియోగించడ వలన ఎటువంటి చీడపీడలు ఆశించకుండా పంట బలంగా పెరుగుతుందన్నారు. భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటకు అవసరమైన పోషకాలను అందిస్తాయన్నారు. పంట ఆరోగ్యకరంగా పెరగడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో పంటను సాగు చేయడం వలన గిట్టుబాటు ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన కార్తికేయ మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు తక్కువ ధరకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ వాడ తిరుపతి, వైద్యులు భారతి, తూలుగు తిరుపతిరావు, పైల బాబ్జి, సైలాడ సతీష్, రవి వర్మ, సన్యాసిరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అఫీషియల్ కాలనీ వాసులు

సారవకోట: మండల కేంద్రంలోని అఫీషియల్ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి శనివారం వినతిపత్రం అందించారు. కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి సమస్యలను వివరించారు. డ్రైనేజీకి అడ్డంగా పాత విద్యుత్ స్తంభం ఉందని, దానిని తొలగించక పోవడంతో మురుగు నీరు వెళ్లడం లేదన్నారు. మరో విద్యుత్ స్తంభం రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ఆటోలు కూడా వీధిలోకి రాలేని పరిస్థితి ఉందన్నారు. వీటిపై పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: ఈ నెల 11వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త విద్యుత్ లైన్లు వేయడం వంటి పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ నర్సింహ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతపట్నం మండల కేంద్రంలోని కోటగుడి కాలనీ తోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఆ మలుపు.. ప్రమాదాలకు పిలుపు



బుచ్చిపేట రోడ్డులో చేనులవలస దాటిన తరువాత ప్రమాదకర మలుపు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



బాలసీమ రోడ్డులో బసివలస దాటిన తరువాత వచ్చిన మలుపు

నరసన్నపేట: రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైలా జంగిల్ పేరుకుపోయాయి. ఇప్పటికే పలు చోట్ల ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు.. ప్రధాన రహదారులపై మలుపులు అధికంగా ఉంటడంతో వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. మండలం పరిధిలోని ఆర్అండ్‌బీ రహదారిలో మడపాం నుంచి ముషిడిగట్టుకు వెళ్లే మార్గంలో చేనులవలస ముందు, తరువాత పలుచోట్ల మలుపులున్నాయి. ఈ రోడ్డు నిర్మానుష్యంగా ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే చికిత్స అందడం కష్టమే. ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరి వరకు వచ్చేవరకు కనిపించే పరిస్థితి లేదు. గునబుపేట నుంచి పారశిల్లికి వెళ్లే మార్గంలో కూడా చెన్నాపురం ముందు, తోటాడ వద్ద రోడ్డు మలుపు లున్నాయి. బాలసీమ నుంచి నరసన్నపేట వెళ్లే రహదారిపై బసివలస ముందు, తరువాత మలుపు లున్నాయి. రహదారి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. జంగిల్ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. లుకలాం–కొమనాపల్లి రోడ్డులో నడగాంతో పాటు పలు చోట్ల టర్నింగ్‌లు ఉన్నాయి. ఇటీవల ఇక్కడ ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందారు. ప్రమాదం జరిగిన ఒకరోజు తరువాత ఈ విషయం వెలుగులోనికి వచ్చింది. ఆర్అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

భయం..భయం



ప్రమాదానికి కారణమవుతున్న మోగివిల్లిపేట రోడ్డు మలుపు ఇదే..

పోలాకి: మండల కేంద్రానికి అనుకుని డీపీఎన్ (డోల–పోలాకి–నౌపడ) రహదారిలో మోగివిల్లిపేట వద్ద ఉన్న రోడ్డు మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. పిన్నింటిపేట వ్యాపారకేంద్రంతోపాటు దాదాపు 15 పంచాయతీల ప్రజలు ఇదే రోడ్డులో మండల కేంద్రానికి చేరుకుంటారు. ఈ రహదారిలో ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకోవటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రెండు వైపులా కాలువ ఉండటంతోపాటు దట్టమైన పొదలుతో ఎదురుగావచ్చిన వాహనాలు కనిపించే అవకాశం లేదు. ఇటీవల కాలంలో అక్కడే చికెన్‌దుకాణాల నుంచి తెచ్చిన వ్యర్థాలను కూడా డంప్‌చేయటంతో రాత్రిపూట సైతం కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మలుపు తిరిగే లోగా వాహనదారులకు అడ్డంగా వస్తున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బోర్డులు పెట్టాలి



గునబుపేట రోడ్డులో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. పిచ్చి మొక్కలు తొలగించి, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టి ప్రమాదాలను నిరోధించాలి.

– బార్ల వేణుగోపాలరావు, చెన్నాపురం, నరసన్నపేట మండలం

జంగిల్ తొలగించాలి



మలుపులతోపాటు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన జంగిల్‌తో ప్రమాదాలు పెరుగుతున్నాయి. ముషిడగట్టు రోడ్డులో మరింతగా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– చింతల వెంకటరమణ, లుకలాం, నరసన్నపేట మండలం

చర్యలు తీసుకుంటాం



ఆర్అండ్‌బీ రహదారులను పరిశీలించి మలుపుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. ద్విచక్ర వాహనదారులు కూడా ట్రాఫిక్ రూల్స్ పాటించి, మలుపులు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి. జంగిల్ తొలగించే పనులు చేపట్టేందుకు పైఅధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– ఎ.శ్రీనివాసరావు, ఏఈ ఆర్అండ్‌బీ

చెరువును తలపిస్తున్న రోడ్డు



ఈ చిత్రం మండలంలోని నివగాం గ్రామ పట్నాల వీధి వద్ద చెరువును తలపిస్తున్న పాలకొండ–హడ్డుబంగి రోడ్డు. మండలంలోని ప్రధాన రహదారుల్లో ఇది ఒకటి. ఈ రోడ్డు ఆంధ్రా –ఒడిశా సరిహద్దు గ్రామాలు మీదుగా బరుపురం, రాయగడతోపాటు ఇతర పట్టణాలకు వెళ్తుంది. ఈ రహదారిలో అడుగుకు ఒక గోయ్యి ఏర్పడింది. నివగాం వద్ద పట్నాల వీధి, ఎస్సీ వీధితోపాటు పలు చోట్లు భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో వర్షం పడితే చెరువును తలపించేలా ఉన్నాయి. దీంతో ప్రయాణికులకు ఈ రోడ్డు ప్రాణసంకటంగా మారింది. – కొత్తూరు

చంద్రబాబు పాలన మోసాలమయం



కింతలిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

పొందూరు: సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి ఆధ్వర్యంలో కనిమెట్ట, కింతలి, అచ్చిపోలవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

తల్లికి వందనం అర్హులందరికీ అందలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఒక ఏడాది ఎగ్గొట్టారన్నారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ నాయకులు కిల్లాన సూర్యారావు, చింతాడ సత్యప్రసాద్, బొడ్డేపల్లి పద్మజ, బొడ్డేపల్లి గంగాధర్, పెద్దింటి రవిబాబు, కూన అన్నంనాయుడు, పైడి నాగభూషణ్, సింగూరు తేజేశ్వరరావు, సూర ఆనందరావు, పైడి చంద్రమణి, అనకాపల్లి రామకృష్ణ, బొడ్డేపల్లి ప్రసాదరావు, పైడి పోలయ్య, జమ్మినాయుడు, వావిలపల్లి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం



విశ్వేశ్వరరావు

సరుబుజ్జిలి: రైతులకు ఎరువులు కావాలంటే 50 శాతం మాత్రమే ఇస్తామని, మిగతా వాటి కోసం ప్రైవేట్ డీలర్ల వద్దకు వెళ్లాలని అధికారులు చెప్పడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి లావేటి విశ్వేశ్వరరావు విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో ఇప్పటివరకు 40 శాతం మంది రైతులకు కూడా ఎరువులు అందలేదన్నారు. ఎరువులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తే ఇంతకంటే మరి ఇవ్వలేమని, ప్రైవేట్ డీలర్ల వద్దకు వెళ్లమని చెప్పడం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ డీలర్లు ఒక్కో యూరియా బస్తాకు సుమారు రూ.400 వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. డీలర్లు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నా.. కట్టడి చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కనీసం ఒక బస్తా కూడా అందించలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారని అన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద పుష్కలంగా లభిస్తున్న ఎరువులు.. రైతు సేవా కేంద్రాల్లో లభించకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించాలి

- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

పొందూరు: ఉపాధ్యాయులపై పనిభారాన్ని తగ్గించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న డిమాండ్ చేశారు. పొందూరులోని డీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ సమావేశంలో మాట్లాడారు. అనవసరమైన బోధనేతర పనులను ఉపాధ్యాలపై రుద్దుతున్నారని తెలిపారు. 11వ పీఆర్సీ బకాయిల, డీఏ బకాయిలను చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని, వారి సర్వీస్‌ను 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల బాధ్యులు గండెం రామారావు, చౌదరి వేణుగోపలరావు, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రాఖీ పౌర్ణమి

సోదరుల క్షేమాన్ని కోరుతూ అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పరస్పరం అభినందనలు తెలియజేసుకుని, ఆశీర్వాదాలు అందుకున్నారు. వేకువజామునే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: పాలకొండలో ఎమ్మెల్సీ విక్రాంత్‌కు రాఖీ కట్టి స్వీట్ తినిపిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్యకు రాఖీ కడుతున్న మహిళలు



కొత్తూరు: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి రాఖీ కడుడుతున్న విద్యార్థులు



నరసన్నపేట: ఎస్సీ బాలికల వసతి గృహంలో సోదరులకు రాఖీ కడుతున్న బాలికలు


శక్తి యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న గిరిధర్

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శక్తి యాప్‌పై టెక్కలి డివిజన్ ఇన్‌చార్జి గిరిధర్ శనివారం అవగాహన కల్పించారు. మహిళల భద్రత, రక్షణ కోసం ఈ యాప్ రూపొందించారన్నారు. అత్యవసర సమయాల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా 112, 100 నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చన్నారు. శక్తిటీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు ప్రవాహం



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

కొత్తూరు: మండలంలోని నివగాం ప్రాథమిక పాఠశాల–1 సమీపంలోని రహదారి పైనుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. పాఠశాల ముందు ఉన్న కుళాయి నీరు ఎటూ వెళ్లేందుకు అవకాశం లేదు. నీరు నిల్వ ఉండి దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు రోగాల బారినపడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి హెచ్ఎం విజయకుమార్ ఇటీవల ఫిర్యాదు చేశారు.

కూటమి ప్రభుత్వానికి పట్టని ఆదివాసీల సమస్యలు



కొత్తూరు: గొట్టిపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నిమ్మక అప్పన్న

కొత్తూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదివాసీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పాలన పూర్తయినా పరిష్కరించడం లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న అన్నారు. మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ.. గిరిజనుల పండగల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పెద్ద పండగ వంటిదన్నారు. ప్రభుత్వ పెద్దలు పంగడలు నిర్వహిస్తున్నారు తప్ప.. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంతో శ్రద్ధ చూపడం లేదన్నారు. జిల్లాకు ఐటీడీఏ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు, విద్య, వైద్యం వంటి రంగాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గిరిజనలు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములను రక్షించాలన్నారు. గిరిజన సంఘం నాయకులు ఆరిక గణపతిరావు, త్రినాథరావు, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు


చాపరాయిగూడలో..

హిరమండలం: ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆదివాసీ గిరిజన సంఘ ప్రతినిధి పల్లా కృష్ణ అన్నారు. గులుమూరు పంచాయతీ చాపరాయిగూడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సమస్యలకు సత్వర పరిష్కారమార్గం చూపాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని, గిరిజనులకు పోడు పట్టాలు అందివ్వాలన్నారు. సంఘ నాయకులు దాసు, ప్రసాద్, రమణ, తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: చాపరాయిగూడలో జెండాను ఆవిష్కరిస్తున్న కృష్ణ, సంఘం ప్రతినిధులు

మురుగునీరు నిల్వ..



ఈ చిత్రం మెళియాపుట్టి మండలం కొత్తమారడికోట గ్రామంలోని రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు. గ్రామంలోని మురునీటి కాలువలు మూసుకుపోయాయి. ఇళ్లల్లోని వాడుక నీరంతా వీధిలో నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మురునీరు నిల్వ లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి